ప్రజాశక్తి

మంగళవారం 30 సెప్టెంబర్ 2025

5

పార్వతీపురం మన్యం

రెవెన్యూ క్లినిక్‌లతో సమస్యలకు చెక్

ప్రజాశక్తి - పార్వతీపురం

రెవెన్యూ క్లినిక్‌లతో రెవెన్యూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కలెక్టరేట్లో ట్రయిల్ రన్ సోమవారం ప్రారంభమైంది. ఈ ట్రయిల్ రన్‌లో కొన్ని గ్రీవెన్సులను వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఇందులో భాగంగా సాలూరుకు చెందిన మక్కువ కృష్ణంరాజు అనే సీనియర్ సిటిజన్ తన సమస్యను తెలియజేయగా తక్షణమే పరిష్కరించబడింది. అలాగే క్షేత్ర స్థాయిలో విచారణకు అవసరమైన సమస్యలకు ఆర్ఒఆర్ కోర్టు నిర్వహించేందుకు వెంటనే నోటీసులు జారీ చేయనున్నారు. క్షేత్ర స్థాయిలో విచారణ అవసరం లేని గ్రీవెన్సులను పరిష్కరించేందుకు వెంటనే సచివాలయ సిబ్బంది (డిజిటల్ అసిస్టెంట్) లాగిన్ లో ధరఖాస్తులు ఆన్ లైన్ లో నమోదు చేయడం జరిగింది.

బీడుగా మారిన భూములు

నాడు పంట పొలాలు..

నేడు బీడు భూములు

ఉద్యోగాలు, నష్టపరిహారం, పునరావాసం ఇలా ఎన్నో ఆశలు చూపించిన ఆల్ఫా ఇన్‌ఫ్రా కంపెనీ.. అమాయక గిరిజనులు, రైతులను అడుగడుగునా మోసం చేసింది. 15 ఏళ్లు గడిచినా కంపెనీ ఏర్పాటు చేయలేకపోయింది. ఇందుకోసం ప్రయత్నించిన అడ్డుదారులు ముందుకు సాగకపోవడమే ఇందుకు కారణం. కానీ, విలువైన భూములు మాత్రం వశపరుచుకుంది. ఇందుకోసం అడుగడుగునా గిరిజన చట్టాలను ఉల్లంఘించింది. చివరికి ప్రభుత్వ అనుమతికి మించిన భూములు కూడా లాగేసుకుంది. దీంతో నిత్యం పచ్చదనంతో తొణికిసలాడే పంట భూములు నేడు బీడువారాయి. సాగునీటి ప్రాజెక్టు పనులు కూడా అర్థాంతరంగా నిలిచిపోయాయి.

- అడుగడుగునా చట్టాల ఉల్లంఘన
- ఆపై అక్రమ కేసులు, బెదిరింపులు
- థర్మల్ పవర్ ప్లాంట్ పేరిట ఆల్ఫా ఇన్‌ఫ్రా కంపెనీ మాయాజాలం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/కొమరాడ

థర్మల్ పవర్ ప్లాంట్ పేరిట కొమరాడ మండలంలోని పెదఖేర్జల, చినఖేర్జల, కోటిపాం, శివరాంపురం, రేగులపాడు పంచాయతీల పరిధిలోని వందలాది ఎకరాలను ఆల్ఫా ఇన్‌ఫ్రా కంపెనీ సేకరించిన సంగతి తెలిసిందే. అందులో అడుగడుగునా మోసాలే కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తొలుత 640.75 ఎకరాల భూమిని సేకరించారు. ఆ తరువాత అప్పటి అధికారులు అత్యుత్సాహంగా వ్యవహరించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే (జిఒ పరిధిని దాటి) ఆల్ఫా ఇన్‌ఫ్రా కంపెనీ పేరున 485.31 ఎకరాలు అదనంగా సేకరించారు. తద్వారా వనకాబడి సాగునీటి ప్రాజెక్టు ఆయకట్టు భూమంతా కంపెనీ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఫలితంగా ఆ ప్రాజెక్టు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

వాస్తవానికి ఈ ప్రాజెక్టును 2009లోనే రూ.6.66 కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టారు. 1037.82 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనేది దీని లక్ష్యం. రెండేళ్లలో రూ.2.43 కోట్లు ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు ఖర్చుచేశారు. ఈలోపు 2010 నుంచి పవర్ ప్రాజెక్టు పేరిట భూసేకరణ మొదలు పెట్టారు. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు ముందుకు తీసుకెళ్లేందుకు జలవనరుల శాఖ అధికారులు వెనుకడుగు వేశారు. దీనికితోడు సేకరించిన భూముల చుట్టూ కంపెనీ యాజమాన్యం కంచె వేయడంతో సాగుచేసుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఈ భూముల్లో ఎక్కువగా వరి, మొక్కజొన్న, పత్తి వంటి వ్యవసాయ ఉత్పత్తులతోపాటు జీడి, మామిడి వంటి ఉద్యాన పంటలు సాగయ్యేవి. వీటితోపాటు మిగిలిన కొండ ప్రాంతంలో గిరిజనులకు జీవనాధారమైన అటవీ ఉత్పత్తులు పుష్కలంగా లభించేవి. దీంతో స్థానిక గిరిజనులు, రైతులు 2010 వరకు రాజుల్లా బతికేవారు. నేడు ఆయా భూములు కంపెనీ చెరలోకి వెళ్లడంతో బీడువారుతున్నాయి. నిర్వాసితులు పొట్టకూటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఆయా భూముల్లో కట్టెల కోసం వెళ్లినా, పశువుల మేతకు తీసుకెళ్లినా అక్రమ కేసులు బెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని గిరిజనులు 'ప్రజాశక్తి' ఎదుట వాపోయారు.

వాస్తవానికి థర్మల్ పవర్ ప్రాజెక్టు పేరిట భూములు తీసుకున్న గ్రామాలన్నీ ఐదో షెడ్యూల్ పరిధిలోకి వస్తాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి ప్రభుత్వ భూములు విక్రయించడం గానీ, కొనుక్కోవడం గానీ రాజ్యాంగ విరుద్ధం. చివరికి నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ యాక్టు -2006)ను కూడా ఉల్లంఘించారు. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం... నిర్వాసితుల ఒత్తిడి మేరకు స్థానిక తహశీల్దార్ వివరణ కోరినప్పటికీ సంబంధిత కంపెనీ యాజమాన్యం స్పందించలేదు. పైగా గిరిజనులే తమ ఆధార పత్రాలను దఖలు చేయాలంటూ బుకాయింపు చర్యలకు దిగిందట. తామే ఆధారాలు ఇవ్వాలని భావిస్తే కొంత సమయం కూడా ఇవ్వాలని కూడా కోరిందట. దీన్నిబట్టి అప్పట్లో చట్ట విరుద్ధంగా కేటాయించిన, కొనుగోలు చేసిన భూములను ఏదో ఒక విధంగా వశపర్చుకునేందుకు కంపెనీ యాజమాన్యం ప్రయత్నిస్తున్నట్టుగా అర్థమౌతోంది. 2013లో పర్యావరణ అనుమతులు రద్దుచేసిన వెంటనే భూములను తిరిగి సాగుదారులకు అప్పగించాల్సిన ప్రభుత్వం ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తోంది.

రావికోన పంచాయతీపై రాజకీయ కక్షలు ఆపాలి

- చెక్ పవర్‌ను పునరుద్ధరించాలి : సర్పంచ్
- డిపిఒ.. టిడిపి కార్యకర్తా? ప్రభుత్వ అధికారా?
- సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు
- గిరిజనుల ర్యాలీ, కలెక్టరేట్ వద్ద బైఠాయింపు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని అధికారులు రాజకీయ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆగ్రహించారు. మండలంలోని రావికోన పంచాయితీ సర్పంచ్ కె.రామస్వామి చెక్ పవర్ రద్దును వ్యతిరేకిస్తూ సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద గిరిజనులతో బైఠాయించారు. తొలుత స్థానిక సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గంగునాయుడు మాట్లాడుతూక్రక రామస్వామి మండలంలోని రావికోన సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి నేటి వరకు గిరిజన హక్కులపై పోరాడుతూ, ప్రభుత్వాల ఒత్తిళ్లను, ఒడిదొడుకులను ఎదుర్కొంటూ గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ పంచాయతీ పరిధిలో గల గ్రామాలకు రోడ్లు వేయించడం, ఇంటింటి కొలాయి కల్పించడంతో గిరిజనులతో పాటు చుట్టుపక్కల పంచాయతీ ప్రజల నుంచి రామస్వామికి ఆదరణ లభించిందన్నారు. పెత్తందారుల భూకబ్జాలను అడ్డుకోవడంలో, ప్రజలకు హాని కలిగించే కొండల మైనింగ్ తవ్వకాలను, డంపింగ్ యార్డ్ ఏర్పాటు వ్యతిరేకించడంలో రావికోన పంచాయతీ ప్రజలకు సాటిలేరనే విషయం విధితమేనన్నారు. నేడు ఈ పంచాయతీపై బురదజల్లేందుకు సర్పంచ్ రామస్వామిపై ఎన్నిక దాడి చేయలేక బిల్లుల నమోదులో అక్రమాలు లోపించిందనే ఆరోపణతో దాడికి ప్రయత్నం జరుగుతుందని, ఇందులో ప్రధాన సూత్రధారి డిపిఒ పి.కొండలరావు అని అన్నారు. మూడు రోజుల వ్యవధిలో రామస్వామిపై వేసిన ఆరోపణకు నివేదిక ఇవ్వాలని అధికారులు తెల్చి చెప్పడం అమానుషమని, అయినప్పటికీ తన చొరవతో నివేదికను అందించే ప్రక్రియ పూర్తి చేసి ఎంపిడిఒ కార్యాలయంలో అందించడం జరిగిందని, అయినా దాన్ని తిరస్కరించి రామస్వామిపై నోటీసు జారీ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అధికారుల పారదర్శకతను సిపిఎం గౌరవిస్తుందని, ఇదే పారదర్శకతను అన్ని రకాల రాజకీయ పార్టీలపైనా, సర్పంచులపై ప్రదర్శించాలని కోరారు. నేటి టిడిపి ప్రభుత్వ హయంలో ఎన్నో భూకబ్జాలు, గిరిజనులపై దాడులు, బిల్లులలో అక్రమాలు నేరుగా ప్రజలకు కనిపిస్తున్నాయని, చాలా పంచాయతీల్లో అభివృద్ధి పనులను చేయకుండా బిల్లులను దోచుకునే సర్పంచులు కొద్దిమంది ఉన్నారని వారిపై ఎటువంటి చర్యలు చేపట్టారో తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మండలంలో గల అన్ని పంచాయితీల అభివృద్ధి పనులపై, రావికోన పంచాయతీ అభివృద్ధి పనిపై దర్యాప్తు చేయాలని సవాల్ విసిరారు. అధికారులు టిడిపి కార్యకర్తలు వ్యవహరించడం దుర్మార్గమని, ప్రభుత్వ అధికారులు రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని, రాజకీయ నాయకులుగా కాదని హితవుపలికారు. ఇప్పటికైనా కుట్రపూరితమైన చర్యలు మానుకోవాలని, చెక్కు పవర్ రద్దును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

రావికోన సర్పంచ్, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రామస్వామి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి కార్యాలయంలో ఎన్నో అవమానాలను, అభివృద్ధి బిల్లుల్లో ఆటంకాలను ఎదుర్కొన్నానని అన్నారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడిన మొదటలో విఎఒ ఎన్నిక ప్రక్రియలో జరుగుతున్న మోసాలను, దౌర్జన్యాలను అడ్డుకున్న కారణంగానే ఈ చర్య అని పేర్కొన్నారు. నాడు టిడిపి అధికారులు ప్రతిపాదించిన విఎఒనే నియమించాలని అధికారులు పట్టుబడటంతో గిరిజనులంతా ముక్తకంఠంతో ఎదిరించి, ఏకగ్రీవంగా విఎఒను ఎన్నుకున్నారని తెలిపారు. గిరిజనులకు అందించే పథకాలు అన్నింటినీ అధికారులు అడ్డుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఎన్ని ఒత్తిళ్లకు గురిచేసినా గిరిజనుల పక్షాన్నే నిలుస్తామని తేల్చి చెప్పారు. దీనిపై న్యాయపోరాటం కూడా చేపడతామని అన్నారు. ఈ సమస్యలపై కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి స్పందిస్తూ సర్పంచ్ చెక్ పవర్ రద్దుపై విచారణ చేపడుతున్నామని, విచారణ నివేదిక అందిన వెంటనే తగిన చర్యలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో సుంకి పంచాయతీ సర్పంచ్ కె.రవీంద్ర, అడ్డాపుశిల మాజీ సర్పంచ్ బంటు దాసు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, సీదరపు అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, కొల్లి సాంబమూర్తి, హెచ్.లక్ష్మణ్, చంటి, కె.శంకర్రావు, కె.గంగన్న, పలువురు వార్డు మెంబర్లు, గిరిజన ప్రజలు, మహిళలు, వృద్ధులు పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు



లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ ప్రభాకరరెడ్డి

జిల్లాలో 2,76,703 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

జిల్లావ్యాప్తంగా 2,76,703 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసుకుంటున్నామని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆధునిక సాంకేతికతతో క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను కలెక్టర్, జెసి, సబ్ కలెక్టర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎటిఎం కార్డు మాదిరిగా ఉండే స్మార్ట్ రేషన్ కార్డును అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ కార్డును బస్సులో గుర్తింపు కార్డు కింద కూడా వినియోగించుకోవచ్చన్నారు. ఏ ప్రాంతంలో ఉన్నప్పటికీ అక్కడ నుంచే రేషన్ పొందవచ్చన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ అతివేగంగా సాంకేతికతను అందిపుచ్చుకొని ప్రజలందరికీ సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రతిచోట చాలా మార్పులను ఈ ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు. వాట్సాప్ ద్వారా మీకు కావాల్సిన సేవలను ఇంటి ద్వారానే పొందుతున్న సంగతిని గుర్తుచేశారు. అలాగే ఇప్పుడు పంపిణీ చేసిన ఆధునిక సాంకేతికత కలిగిన క్యూఆర్ కోడ్ తో ఉన్న రేషన్ కార్డు ద్వారా మీకు అందుబాటులో ఉన్న రేషన్ డిపో నుంచి సరుకులను పొందవచ్చని తెలిపారు. మీరు ఇతర జిల్లాల్లో ఉన్నప్పటికీ కూడా అక్కడ నుంచి రేషన్ పొందవచ్చని, అదే ఈ కార్డుకు ఉండే సౌలభ్యమని కలెక్టర్ వివరించారు. జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రేషన్ పొందడంలో గతంలో ఉండే సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ క్యూఆర్ కోడ్ తో ఉన్న స్మార్ట్ కార్డులను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని అన్నారు. జిల్లాలో 500 పైగా రేషన్ డిపోలు ఉన్నాయని, వాటిలో ఎక్కడ నుంచైనా రేషన్ పొందవచ్చని తెలిపారు. ఈ జిల్లాలోనే కాకుండా వేరే జిల్లాలో ఉన్నప్పటికీ కూడా అక్కడ నుంచి రేషన్ పొందవచ్చన్నారు. రేషన్ పొందడానికి కాకుండా దీన్ని గుర్తింపు కార్డు కింద కూడా ఉపయోగించుకోవచ్చని ఆయన అన్నారు. కార్యక్రమంలో సాలూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ముఖీ సూర్యనారాయణ, ఎంపిడిఒ పార్వతి, తహశీల్దార్, ఇతర అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఒఎన్‌జిసి క్రీడా స్కాలర్‌షిప్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఒఎన్‌జిసి క్రీడా స్కాలర్ షిప్ పథకం కింద ఈ విద్యా సంవత్సరానికి గానూ వెనుకబడిన ప్రతిభావంతులైన క్రీడాకారులకు స్కాలర్ షిప్‌ను అందిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 క్రీడా విభాగాల్లో సబ్-జూనియర్, సీనియర్ పురుషులు, మహిళా క్రీడాకారులకు నెలకు రూ.15వేలు నుంచి రూ.30వేల వరకు క్రీడాస్కాలర్ షిప్‌లను 250మందికి అందించనుందని అన్నారు. ఈ స్కాలర్‌షిప్ 15 నుండి 20 సంవత్సరాల వయస్సు ఉండి, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షల్లోపు గల అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఒఎన్‌జిసి అధికారిక వెబ్ సైట్ http://sportsscholarship.ongc.co.in నందు అక్టోబర్ 21లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేయడానికి ముందు పోర్టల్‌లో ఇవ్వబడిన పథకం వివరాలతో పాటు నిబంధనలు, షరతులను తప్పక గ్రహించాలని సూచించారు. దరఖాస్తులు కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించబడతాయని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఒఎన్‌జిసి వెబ్ సైట్ ద్వారా దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని క్షుణ్ణంగా పరిశీలించి, ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా సమర్పించి ఒఎన్‌జిసి క్రీడా స్కాలర్ షిప్ స్కీం-2025-26 అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటన ద్వారా కోరారు.

అభివాదం చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ధర్నాను విజయవంతం చేయండి : ఫ్యాప్టో

ప్రజాశక్తి - పార్వతీపురం

అక్టోబర్ 7న విజయవాడలో జరగనున్న ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో పరిశీలకులు ఎజిఎస్ గణపతి కోరారు. ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పి.కూర్మినాయుడు అధ్యక్షతన సోమవారం స్థానిక ఎన్జీవో హోంలో జరిగిన సభ్య సంఘాల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగ, ఆర్థిక సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోనందున ఈపాటికి జిల్లా కేంద్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ధర్నా కార్యక్రమాల్ని నిర్వహించిందన్నారు. ప్రభుత్వం నుండి తగిన స్పందన లేనందున రాష్ట్ర కేంద్రంలో ఈ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహన రావు మాట్లాడుతూ అనేక ఆర్థిక బకాయిలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని, వాటిని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు బోధ నేతర కార్యక్రమాలు నుండి విముక్తి కల్పించాలని కోరారు. తక్షణమే ప్రభుత్వం ఈ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని సమావేశం కోరింది. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, ఎపిటిఎఫ్ 257 జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సోమవారం సాయంత్రం వీచిన గాలి, పడిన వర్షానికి మండలంలోని పి.ఆమిటి జంక్షన్ వద్ద భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం, అలాగే గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురం వైపు వెళ్లేందుకు ద్విచక్ర వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పార్వతీపురం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనంపై భారీ వక్షం పడడంతో ఆ వాహనం పాడైపోయింది. సుమారు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాలం చెల్లిన చెట్లు రోడ్డుకు సమీపన తరచూ కూలిపోతున్నాయి. కులుతున్నాయి.

సీతంపేటలో కుండపోత వర్షం

సీతంపేట : గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎండలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. అయితే సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసినప్పటికీ సాయంత్రమయ్యేసరికి ఒక్కసారిగా మేఘం చల్లబడి చీకటిగా మారి సుమారు అరగంట పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో గెడ్డలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి.

కోటదుర్గమ్మను దర్శించుకున్న ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు

ప్రజాశక్తి పాలకొండ

పట్టణంలోని కోటదుర్గ అమ్మవారిని ఎన్జీవో శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు హనుమంత సాయిరాం కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది అతిథి మర్యాదలతో స్వాగతం పలికారు. ఈయనతో పాటు ఎన్జీవో డివిజన్ గౌరవాధ్యక్షులు లిల్లీ పుష్పనాథం, అధ్యక్షులు రంగాచారి, కార్యదర్శి ఈశ్వరరావు, విశ్రాంత తహశీల్దార్ నరసింహమూర్తి తదితరులు ఉన్నారు

మెప్మా ద్వారా పేదలకు మరిన్ని కార్యక్రమాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

మెప్మా ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం మెప్మా ఆధ్వర్యంలో నగర పంచాయతీ ఆవరణలో పిఎం స్వనిధి 2.0 లోక కల్యాణ మేళా పథకంపై వీధి విక్రయదారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ మెప్మా ద్వారా రుణాలు తీసుకొని లబ్దిపొంది స్వశక్తితో ముందుకు వెళ్లాలన్నారు. చిన్న వ్యాపారులకు రూ.15వేలు నుంచి రూ.50వేలు వరకు రుణాలందించడం జరుగుతుందని దీని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఆకుల కుమారి, కమిషనర్ రత్నరాజు, నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, జనసేన పట్టణ నాయకులు కె.రాజేష్, గంగునాయుడు, అంపోలు శ్రీను తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దుచేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

హైడ్రో పవర్ అనుమతులు రద్దు చేయాలని మండలంలోని శతాభి సర్పంచ్ శిల్పజన్ని రామయ్య, ఎంపిటిసి ప్రతినిధి చదలరాజు, తంగలం సర్పంచ్ అప్పన్న ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హైడ్రో ప్రాజెక్టు ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నవయుగ కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీసా చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, 1/70 చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. గిరిజనుల అనుమతుల్లేకుండా గ్రామసభలు ప్రాధాన్యత లేకుండా డ్రోన్ ద్వారా సర్వేలు చేయడం తగదన్నారు. సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి నవయుగ కంపెనీకి ఇచ్చే అనుమతులు రద్దు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ పెట్టుబడిదారుల సేవల్లో మునిగిపోయి దేశ సంపదను కార్పొరేట్లకు అమ్ముతున్నారని గిరిజనులను జల సమాధి చేయొద్దని అన్నారు. ఇప్పటికైనా సస్యశ్యామలంగా ఉన్న ఈ ప్రదేశంలో హైడ్రోపవర్ ప్రాజెక్టు కట్టి గిరిజనులను భూములు, అడవుల నుంచి వెళ్లగొట్టుదని తెలిపారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నుంచి కాపాడండి : కలెక్టర్‌కు వినతి

పార్వతీపురం : పాడేరు జిల్లాలోని గుజ్జిలి సమీపాన ఏర్పాటు చేయనున్న నవయుగ పవర్ ప్రాజెక్ట్ నుంచి తమ భూములను కాపాడాలని కోరుతూ పాచి పెంట మండలం శతాభి, మూటకూడు, గరిసిగుడ్డి, తంగ్లాం పంచాయతీ గిరిజనులు, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గుమ్మకోట, గుజ్జెల్లి, లోతేరు గ్రామ పంచాయతీల ప్రజలు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు డి. పండు మాట్లాడుతూ తమ ప్రాంతంలో ప్రతిపాదించిన హైడ్రోపవర్ ప్రాజెక్టు వల్ల స్థానిక గిరిజనులు జీవనాధారాలు, వ్యవసాయ పనులు, అడవి ఆధారిత వనరులు కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. పర్యావరణం, నీటి వనరులు, అడవులు దెబ్బతింటాయని చెప్పారు. ప్రజల అభిప్రాయాలను సేకరించకుండానే ప్రాజెక్టు పనులు ముందుకు తీసుకువెళ్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రాజెక్టు విషయమై గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయాలను తప్పనిసరిగా సేకరించాలని డిమాండ్ చేశారు. గిరిజన హక్కులు, జీవనాధారాలు, పర్యావరణ రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒలిసి అప్పలస్వామి, వెంకట్రావు, బాబురావు, చంద్రయ్య పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందజేస్తున్న గిరిజన ప్రజాప్రతినిధులు

సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్ బ్రోచర్ విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఎస్‌టి 2.0 ద్వారా పేద, మధ్య తరగతి వర్గాలకు చేకూరిన లబ్దిని తెలియజేసే సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ బ్రోచరును కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి విడుదల చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బ్రోచర్ విడుదల కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని జెసి సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు ఎం.సుధారాణి, కె.రామచంద్రరావులతో కలిసి సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ బ్రోచరును విడుదల చేశారు. దీనివల్ల ప్రజలకు కలిగే లబ్దిని ప్రజలకు వివరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి, జెసి, డిఆర్ఒ

సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ వారం నుంచి రెవెన్యూ, సంక్షేమ-అభివృద్ధి సమస్యలపై వేర్వేరుగా ప్రత్యేక గ్రీవెన్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలోకలెక్టర్ అధ్యక్షతన రెవెన్యూ, సంక్షేమం - అభివృద్ధి రెండు విభాగాలుగా పిజిఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో కలెక్టరుతో పాటు జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఎస్‌డిసీలు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు ఎం.సుధారాణి,కె.రామచంద్రరావు అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 102మంది తమ అర్జీలను అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. కార్యాలయాలను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిఎం అవార్డుల కోసం మీ శాఖల్లో సాధించిన లక్ష్యాలను తెలియజేయాలన్నారు. ప్రతి ఐటిఐకి ఒక జీవన భృతి చూపించాలని, అన్ని మండలాల అధికారులు అభివృద్ధికి చేయదుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజలందరికీ తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. వారా గ్రామాల్లో ఆక్రమణలపై ఫిర్యాదులు అందుతున్నాయని, సంబంధిత అధికారులు సకాలంలో పర్యవేక్షించకపోవడంతో ఇటువంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఈఓలు విషయమై పంచాయతీ సెక్రటరీలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని అన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే ఆక్రమణలు నిరోధించే దిశగా చర్యలు చేపట్టాలని, నోటీసులు జారీచేసే సమయంలో రెవెన్యూ చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఎంపిడిఒలు ఆజెండా వేసుకొని చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని తెలిపారు.

పిజిఆర్ఎస్‌కు అందిన వినతుల్లో కొన్ని ఇలా..

◆ జిల్లా నుంచి నార్త్ జోన్ క్రికెట్ టోర్నమెంటుకు ఎంపికైన క్రీడాకారులకు కలర్ దుస్తులు ఇప్పించాలని, అలాగే టోర్నమెంటుకు వెళ్లి వచ్చేందుకు ఆర్థికంగా సాయం చేయాలని కోరుతూ భామిని మండలం నేరడి -బికి చెందిన కె.శ్రీను, తదితరులు జిల్లా కలెక్టరుకు దరఖాస్తులు అందజేశారు.

◆ కురుపాం మండలం ధర్మలక్ష్మీపురం పివిటిజి గ్రామంలోని 10 సవర కుటుంబాలకు పక్కా గృహాలను మంజూరు చేయాలని కె.సౌంబర అర్జీని అందించారు.

రెవెన్యూ, సంక్షేమ అభివృద్ధి సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్సులు

◆ పాచిపెంట మండలం మాతుమూరు నుంచి పూతికవలస జంక్షన్ వరకు గల రహదారి సరిగా లేనందున ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, కావున ప్రజల సౌకర్యార్థం రహదారి మరమ్మతులను చేపట్టాలని డి.ఆనందకుమార్ తదితరులు వినతి పత్రం అందజేశారు.

◆ సర్వేనెం.197-12బిలో బిసి కాలనీలో గల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని గరుగుబిల్లి మండలం శివ్వాంకి చెందిన పి.నరసింహనాయుడు దరఖాస్తు అందజేశారు.

◆ కొమరాడ మండలం సివినికి చెందిన జి.భారతి గ్రామ రెవెన్యూలో 141-4డిలోని 1- 11 సెంట్ల భూమిని సర్వే జరిపించి 1-బి పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరారు.

◆ గరుగుబిల్లి మండలం చినగుడబకి చెందిన ఎస్.నవీన్ మా హౌస్ హోల్డింగ్ మ్యాపింగులో వేరే వ్యక్తి పేరు ఉన్నందున ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు రావడంలేదని, కావున ఆ పేరును జరుమా తన పేరును సవరణ చేయాలని అర్జీ అందజేశారు.

◆ సర్వేనెం.226-15లో గల 28 సెంట్ల తన భూమిని తోటపల్లి బ్యారేజ్ వారు ముందస్తు సమాచారం లేకుండా తవ్విన పిల్ల కాలువ వల్ల కలిగిన నష్టానికి పరిహారం ఇప్పించాలని సీతానగరం మండలం లక్ష్మీపురానికి చెందిన ఎ.నాగేశ్వరరావు కోరారు.

◆ వీరఘట్టం మండలం చిట్టిపూడివలసకు చెందిన వై.కన్యయ్యలో 0.20

ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న అర్జీదారులు

సెంట్లు భూమికి పట్టా మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు.

◆ గృహ నిర్మాణ సంస్థ ద్వారా ఇల్లు మంజూరు చేయాలని బలిజిపేట మండలం నారాయణపురానికి చెందిన ఎం.సాహితి అర్జీని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో

పార్వతీపురం టౌన్ : ఎస్‌పి ఎస్.వి.మాధవ్ రెడ్డి సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన 5 అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ ఆదాం, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట ఐటిడిఎలో....

సీతంపేట: గిరిజన సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు జిజిఆర్ఎస్‌లో విన్నవించారు. ఐటిడిఎ ఎపిఒ చినబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు అర్జీదారులు తమ సమస్యలపై వినతులు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఇఇ రమాదేవి, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌రావు, సిడిపిఒ సింహాలమ్మ, పిహెచ్ఒ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి శ్రీనివాస్

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని దత్తి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన కోసం ఏర్పాట్లను ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, ఎస్పీ ఎ.ఆర్.దామోదర్‌లతో కలిసి పరిశీలించారు. హెలిపాడ్ నుంచి ప్రజావేదిక వద్దకు, పింఛనుదారుల గృహాల వద్దకు ముఖ్యమంత్రి వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. వాహనాల పార్కింగ్, రాజకీయ ప్రతినిధుల సమావేశానికి ఏర్పాటు చేసిన హాల్‌ను, ముఖ్యమంత్రి విశ్రాంతి కోసం ఏర్పాటు చేస్తున్న గ్రీన్‌రూమ్‌ను తనిఖీ చేశారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పింఛను అందుకోనున్న లబ్ధిదారుల గృహాలను కూడా తనిఖీ చేశారు. ముఖ్యమంత్రి సెక్యూరిటీ సిబ్బంది కూడా హాజరై ప్రోటోకాల్స్‌ను, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో జెసి సేతు మాధవన్, అదనపు ఎస్పి సౌమ్యలత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జిఎస్‌టి సంస్కరణలను వివరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం డంగభద్రలో సోమవారం ప్రజలు, వ్యాపారస్తులకు జిఎస్టీ సంస్కరణలను ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వివరించారు. సమాజంలో అన్ని రంగాల వారికి జిఎస్‌టి సంస్కరణల వల్ల ఉపయోగకరంగా ఉందని వివరించారు. జిఎస్‌టి సంస్కరణలతో వ్యాపార సమూహాలకు అందే ప్రోత్సాహంతో అమ్మకాలు పెరిగి వ్యాపార అభివృద్ధి జరుగుతుందన్నారు. జిఎస్‌టికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు, వ్యాపారస్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డొంకాడ రామకృష్ణ, దత్తి లక్ష్మణరావు, పువ్వల లావణ్య, జోగి భుజంగరావు, దాసరి రామారావు, మరడాన తవిటినాయుడు, సుమన్, నారాయణస్వామి, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల కోసమే అన్న క్యాంటీన్

ప్రజాశక్తి - సీతంపేట

పేదల కోసమే అన్న క్యాంటీన్ అని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆవరణలో పేద గిరిజనులకు వైద్యం కోసం వచ్చే ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం రూ.61.00 మంజూరు చేసిన అన్న క్యాంటీన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గానికి ఒకటి చొప్పున అన్న క్యాంటీన్లు ప్రభుత్వం మంజూరు చేయగా, సీతంపేటలో అదనంగా నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి, డిప్యూటీ సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సలహా మండల సభ్యులు ఎస్.మాలయ్య, మండల జనసేన అధ్యక్షులు మన్నంగి విశ్వనాథం, కూటమి నాయకులు నిబ్రహం ప్రసాద్, పవన్, రవణమ్మ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ఆహ్వానించలేదు

సీతంపేటలో సచివాలయం ప్రాంగణంలో అన్న క్యాంటీన్ శంకు స్థాపనకు తమను ఆహ్వానించలేదని టిడిపి పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి పడాల భూదేవి, మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొగలింగం, మాజీ ఎంపిటిసి బిడ్డిక జయలక్ష్మి, ఎఎంసి డైరెక్టర్ ఎం.మోహన్‌రావు తెలిపారు.

శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉమామహేశ్వరి

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

బాలల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాలల పరిరక్షణ చట్టాలపై శిక్షణ నిర్వహించారు. ప్రతి నెలలో రెండుసార్లు సమావేశమై ఆ గ్రామ, సచివాలయం పరిధిలో పిల్లల సమస్యలు గురించి చర్చించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బాల్యవివాహాలు నిరోధించాలని సూచించారు. బాలలపై జరుగుతున్న దాడులను నిరోధించేందుకు ఫోక్సో చట్టం అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఒ జి.రజిని దుర్గ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్లు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనలో ఉన్న భయాన్ని తొలగించాలి : డిఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

భౌతిక శాస్త్రంలో ఉన్న భయాన్ని విద్యార్థులు తొలగించుకోవాలని, జిల్లా విద్యాశాఖ అధికారి బి.రాజ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర) భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు జి.లక్ష్మణరావు విద్యార్థుల కోసం సులువుగా తయారు చేసిన మెటీరియల్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చక్కగా చదివి పదో తరగతి పరీక్షల్లో శత శాతం మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అడిషనల్ కోఆర్డినేటర్ ఆర్ తేజేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బందిపాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ, ఉపాధ్యాయులు

డిజిటల్ బుక్ జగనన్న 2.0 ఆవిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

డిజిటల్ బుక్ జగనన్న 2.0ను మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ, పార్టీ ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ వైసిపిలో ఇకపై కార్యకర్తలకే పెద్దపీట ఉంటుందని, కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందని, ఈ విషయాన్ని పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురవుతున్న కార్యకర్తలకు అండగా నిలవడానికి రాష్ట్ర వ్యాప్తంగా 'డిజిటల్ బుక్' తెరిచినట్టు తెలిపారు. ఈ డిజిటల్ బుక్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఇటీవల రాష్ట్ర స్థాయిలో విడుదల చేశారని, అందులో భాగంగా సోమవారం ఇక్కడ నియోజకవర్గ స్థాయిలో విడుదల చేసినట్టు తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయన్నారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన 17 మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరించడాన్ని వైసిపి తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, ప్రధాన కార్యదర్శిలు పోల సత్యన్నారాయణ, టి.ప్రసాద్, అధికార ప్రతినిధి ఎం.సత్యంనాయుడు, మండల, పట్టణ వైసిపి అధ్యక్షులు బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, కొండపల్లి బాలకష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీస్వరి వైఎస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, జడ్పీటీసీలు అలజంగి రవికుమార్, మామిడి బాబ్జీ, ఎంపీపీలు మజ్జి శోభారాణి, గుడివాడ నాగమణి, వైఎస్ ఎంపిపిలు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వైసిపి వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు,, ప్రజాప్రతినిధులు, నాయకులు

నేడు బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ మంగళవారం ఎస్సీ సెల్ అనుబంధ విభాగం ఆధ్వర్యంలో పార్వతీపురంలోని బిఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్టు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కోల సుధాకర్ పిలుపునిచ్చారు. అన్ని అనుబంధ విభాగాలతో పాటు దళిత సామాజికవర్గ పార్టీ నాయకులను, దళిత సంఘాలను కలుపుకుంటూ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామని, కావున అన్ని మండలాలు, పురపాలక సంఘం నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఆక్రమణకు గురైన బైరిసాగరం

'పక్కా' నిర్మాణాలు.. పట్టని అధికారులు

ఆక్రమణలతో ఇరుకైన బైరిసాగరం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మక్కువలో ప్రధాన రహదారులకు ఆనుకొని ఉన్న బైరి సాగరం పక్కా భవనాలు నిర్మించుకొని ఆక్రమించుకోవడంతో చెరువు రూపమే కోల్పోయింది. ఈ చెరువు సుమారు 19 ఎకరాల విస్తీర్ణం ప్రభుత్వ రికార్డుల్లో చూపుతున్నప్పటికీ చుట్టూ ఆక్రమ ణలతో ఆక్రమార్కులు వశమైయిపోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక్కడ భవనాలు ఏళ్ల తరబడి నిర్మిస్తున్నా, ప్రభుత్వాలు ఎన్ని మారినా ఆక్రమణల వైపు తన్నెత్తి చూడక పోవడంతో అధికారులపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ చెరువు ఆక్రమణల వల్ల వేసవిలో గ్రామంలోని పలు వీధుల్లో భూగర్భ జలాలు నిలవలేక తాగునీటికి ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పలుమార్లు అధికారులు నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప ఆక్రమణలను తొలగించే కార్యక్రమం చేపట్టక పోవడం వెనుక అంతర్యమేమిటో తెలియడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

జెసికి సమస్యలను వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముంపు ప్రాంతాలను పరిశీలించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

చిన్నపాటి వర్షం పడినా పట్టణం మునుగుతోందని, పట్టించుకోండని కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రధాన రోడ్డు కాలువలో పూడికతీత పనులు చేపట్టకపోవడం వల్ల కాలువలు ఆక్రమణకు గురికావడం, కనెక్టింగ్ కాలువలు కనుమరుగు కావడంతో వర్షపు నీరు కాలువల్లో ప్రవహించక మెయిన్ రోడ్డుపై వస్తోందన్నారు. దీనివల్ల వర్షం పడేటప్పుడు పట్టణ మెయిన్ రోడ్డు దాదాపు నాలుగడుగుల వరకు నీరు చేరి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. మెయిన్ రోడ్‌లోని పలు షాపులోకి నీరు చేరుతోందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారన్నారు. వీటితో పాటు పలు చెరువులు వరహాల గెడ్డ కబ్జాకు గురికావడంతో నీటి ప్రవాహం వీధుల్లోకి వస్తోందన్నారు. దీంతో గెడ్డ వీధి, సౌందర్య రోడ్డు, గణేష్ నగర్, బైపాస్ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణం తదితర ప్రాంతాలన్నీ జలమయవుతున్నాయన్నారు. తక్షణమే దీనిపై తగు చర్యలు తీసుకొని శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. మున్సిపల్ పరిపాలన గాడి తప్పిందని, దీనిపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని అందజేశారు. చెరువుల కబ్జా వల్లే ముంపు ముప్పు ఏర్పడిందన్నారు. దీనికి స్పందించిన జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే చెరువుల కబ్జాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ వివరాలు కోరారన్నారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.

వెంకట్రావును పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తలవరానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు చందక వెంకట్రావు అనారోగ్యంతో ఉన్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య స్థితిగతులు ఏవిధంగా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం :జియ్యమ్మవలస గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త దాసరి చిన్న అప్పలస్వామి కుటుంబ సభ్యులను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ మీకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట జియ్యమ్మవలస మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పైడితల్లమ్మ హుండీ ఆదాయం రూ.16,75,917

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మ దేవస్థానంలో చదురగుడి హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ.16,75,917 నగదు, బంగారం 14 గ్రాములు, వెండి 301 గ్రాములు వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ శిరీష తెలిపారు.

ఏజెన్సీ రహదారులు బాగు చేయండి

గిరిజన ప్రజా ప్రతినిధుల వేడుకోలు

ప్రజాశక్తి - పాచిపెంట

ఏజెన్సీలో అధ్వానంగా ఉన్న రహదారులను బాగు చేయాలని పలువురు గిరిజన ప్రజాప్రతినిధులు అధికారులను వేడుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మండలంలో పద్మాపురం జంక్షన్ నుంచి కుంతాం వరకు మాతుమూరు జంక్షన్ నుంచి కన్నయ్యవలస వరకు పూర్తిగా రోడ్డు పాడైపోయిందని, అలాగే ఏజెన్సీలో అనేక రహదారులు అధ్వానంగా తయారయ్యాయని, దీంతో గిరిజన ప్రాంత ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆయా ప్రాంత ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు సభ్యులు కోరారు. మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు సరిపడే ఎరువులను రైతులకు అందజేశామన్నారు. ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు మాట్లాడుతూ మండలంలో ఆధార్ కార్డు ప్రామాణికంగా ఎరువులు పంపిణీ చేయడం వల్ల నిజమైన సాగు రైతులకు యూరియా సక్రమంగా అందలేదని, కొంతమంది నకిలీ రైతులు ఆధార్ కార్డుల ద్వారా ఎరువులు తీసుకుని నల్ల బజారుకు తరలించారని, ఇకపై క్షేత్రస్థాయిలో సాగు రైతులను గుర్తించి ఎరువులు పంపిణీ చేయాలని కోరారు. స్పందించిన ఎఒ తిరుపతిరావు ఇకపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆధార్ కార్డు కాకుండా, 1-బి, పాస్ బుక్ ఉన్న రైతులకు అలాగే సాగు రైతులకు ఎరువులు సక్రమంగా అందిస్తామని తెలిపారు. పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్ మాట్లాడుతూ గురువునాయుడుపేట గ్రామ పరిధిలో వ్యవసాయ మోటార్లకు త్రీఫేస్ సప్లై సక్రంగా అందడం లేదని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రబీ సీజన్‌కు వ్యవసాయ మోటార్లకు లోవోల్టేజ్ సమస్య లేకుండా విద్యుత్ సప్లై ఉండాలని ఎలక్ట్రికల్ ఎఇ సింహాచలం కోరారు. స్పందించిన లోవోల్టేజ్ సమస్య లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన సచివాలయాలు, అంగన్వాడీ భవనాలు, రైతు భరోసా కేంద్రాలను పూర్తిచేయాలని పలువురు సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, వైస్ ఎంపిపి మీసాల నారాయణ, ఎంపిడిఒ బివిజె పాత్రో, ఇఒపిఆర్‌డి పి.మల్లేశ్వరరావు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో సమ్యలను వివరిస్తున్న సర్పంచ్ సభ్యులు యుగంధర్

పలుచోట్ల ఘనంగా అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక విజ్ఞాన భారతి పాఠశాలలో సోమవారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కన్నబాబు, కరస్పాండెంట్ పాండురంగ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే కురుపాం శ్రీ కోటదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీసరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చుట్టూ పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమ పూజలు, ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు.

చింతల గూడ వీధి పాఠశాలలో సరస్వతీదేవి పూజ

గుమ్మలక్ష్మీపురం : మండల కేంద్రంలో గల చింతలగూడ వీధి ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో సరస్వతిదేవి పూజ నిర్వహించారు. ప్రతి ఏటా పాఠశాలలో సరస్వతీదేవి పూజా కార్యక్రమాలను విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటామని పాఠశాల మేనేజర్ బేత కృష్ణమూర్తి నాయుడు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కుమారస్వామి పాల్గొన్నారు.

కురుపాంలోని విజ్ఞాన భారతిలో అక్షరాస్యం చేస్తున్న కరస్పాండెంట్

విజయనగర ఉత్సవాల్లో 5న కవి సమ్మేళనం

విజయనగరం కోట : విజయనగర ఉత్సవాలలో భాగంగా అక్టోబర్ ఐదో తేదీన మహారాజా లేడీస్ అండ్ రిక్రియేషన్ క్లబ్‌లో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వేదిక కన్వీనర్ డాక్టర్ జి.జనార్దన్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విజయనగరం జిల్లా పరిధిలోని కవులతో స్వీయ కవితా పఠనం నిర్వహిస్తున్నామని చెప్పారు. కవితలు తెలుగు సాహిత్యాన్ని ప్రతిబింబించేలా ఉండాలని తెలిపారు. దేశభక్తి, సామాజిక స్పృహని పెంపొందించే విధంగా ఉండాలని, ప్రభుత్వ వ్యతిరేక విషయాలపై కవిత్వం ఉండరాదని సూచించారు. కవి సమ్మేళనంలో పాల్గొన దలిచినవారు తమ స్వీయ కవితలను ఒక పేజీకి మించకుండా రాసి వాట్సాప్‌లో పంపాలని కోరారు. పూర్తి వివరాలకు చీకటి దివాకర్ (9441176882), సముద్రాల గురుప్రసాద్ (9490462262), భోగరాజు సూర్యలక్ష్మి (9440117116)ను సంప్రదించాలని సూచించారు.